# మృత్యువు

• గోపిశెట్టి నాగేశ్వరరావు •

వేగంగా దూసుకు పోతున్న ఫియట్ కారు ఠక్కున ఆగింది. వెనుక సీట్లో కూర్చొని చిన్నగా కునుకుపాట్లు తీస్తున్న జోగేశ్వరరావు ఒక్కసారిగా కళ్ళు తెరిచి చూసాడు.

చుట్టు కారడవి! రాత్రి పదకొండు గంటలు! అక్కడక్కడ అరుస్తున్న పక్షులు, జంతువులు, అరుపులు. భయంకరంగా వుంది అడవి!

'కారెందుకాపావ్...!' అడిగాడు డ్రైవర్ని.

అప్పుడే క్రిందకు దిగి టైరుని చూసిన డ్రైవరు —'టైరుకు పంక్చర్ అయింది! టైరు మార్చాలి!' అన్నాడు.

'వెనుక డిక్కీలో స్టెపిన్ టైరు లేదా...?'

'లేదు సార్! మనం బయలుదేరిన తరువాత ఒక టైరుకి గాలి తగ్గుతుంటే, ఆ స్టెపిన్ టైరుని దానికే వేసాను!'

'మరి ఇప్పుడెట్లగా...?' కొద్దిగ భయంగా ప్రశ్నించాడు.

'ఇక్కడ వూరు రెండు కిలోమీటర్ల దూరంలో వుంది! మీరు ఇక్కడే వుండండి! నేను వెళ్ళి పంక్చర్ వేసుకొని వస్తా...!'

ఆ మాటలకు జోగేశ్వరరావుకి కొద్దిగా భయం వేసినా, ఆ తరువాత డ్రైవరు ముందు ధైర్యంగ వుండాలి అని, సరే...!' అన్నాడు.

డ్రైవరు కూడ వెళ్ళిపోయాడు.

★★★★

పది నిమిషాలు గడిచాయి!

రివ్వున చల్లటిగాలి వీస్తుంది! ఎదురుగా కొద్ది దూరంలో ఒక తెల్లటి 'ఆకారం' కనబడుతుంది! జోగేశ్వరావు భయం, భయంగా కూర్చున్నాడు! రివ్వున వీస్తున్న గాలికి. అది వచ్చి జోగేశ్వరావు మీద పడింది! ఒక్కసారిగ రక్షించండి, రక్షించండి అంటూ పెద్ద కేకపెట్టాడు!

అతను పెట్టిన కేకకు బంగళ అంతా ప్రతిధ్వనించింది! నౌకర్లు, భార్య అంతా పరిగెత్తుకుంటూ వచ్చారు! అతని గదిలోకి 'ఏమయిందండి...?' భార్య ప్రశ్నించింది ఆందోళనగ.

'ఏమయింది అయ్యగారు...'? నౌకర్లు ప్రశ్నించారు కంగారుగ.

కళ్ళు తెరిచి చూసాడు! టైము ఆరుగంటలు. ఎదురుగ మనుషులు కన్పిస్తున్నారు!

'అంటే... ఇది కలా....!' తనని తానే ప్రశ్నించుకున్నాడు.

'హమయ్య...! బ్రతికిపోయాం'. ప్రమాదం నుండి బయట పడ్డవాడు లాగ గటగట రెండు గ్లాసులు నీళ్ళు తాగాడు!

★★★★

●●●

అతను పెట్టిన కేకకు బంగళా అంతా ప్రతిధ్వనించింది.

●●●

సమయం మధ్యాహ్నం రెండు గంటలు...!

జోగేశ్వరరావు విపరీతంగా ఆలోచిస్తున్నాడు!

ఈ రోజు తను టెండరు పని మీద బెంగుళూరు వెళ్ళాలి! కచ్చితంగ రేపు ఉదయం హాజరు కావాలి. అంటే రాత్రి ప్రయాణం తప్పదు. రాత్రివచ్చిన కల గుర్తుకు వచ్చింది! అంతే. వెన్నుపూసలోంచి చలిపుట్టుకొచ్చింది.

'ఊ... ఆఫ్ట్రాల్ ఒక కలకు భయపడటమానో' అని వెళ్ళడానికి సిద్ధపడ్డాడు!

'డ్రైవర్!' గట్టిగ పిలిచాడు.

మరుక్షణం డ్రైవరు ఎదురుగ నిలబడ్డాడు!

'డ్రైవర్ని పిలిస్తే నువ్వు వచ్చావేంటి...?' అతడికేసి చికాకుగ చూస్తు అన్నాడు.

'మీ కారు డ్రైవర్ వాళ్ళ అమ్మకి సీరియస్‌గా వుందని వాళ్ళ ఊరు వెళితే అమ్మగారు ప్రస్తుతానికి నన్ను వుండమన్నారండి! ఉదయమే చేరాను' వినయంగ చెప్పాడు కొత్త డ్రైవరు.

'సరేగాని, టెండరు పని మీద బెంగుళూరు వెళ్ళాలి! రేపు ఉదయం అక్కడ వుండాలి! నువ్వు రెండు గంటల్లో రెడీ అయి, కారుని కూడ ఒకసారి చెకింగ్ చేయించి తీసుకురా...!'

'అలాగే... సార్!'

★★★★

కారు నేషనల్ హైవే మీద దూసుకుపోతోంది.

అర్ధరాత్రి పన్నెండు గంటలు సమయం...!

టక్కున కారాగింది! డ్రైవరు క్రిందకు దిగాడు.



'టైరుకి పంక్చర్ అయింది సార్...!'

జోగేశ్వరరావుకి గుండె ఆగినంత పనయింది. ఆ మాటకు ఉలిక్కిపడ్డాడు కూడ!

ఆ భావం గమనించిన డ్రైవరు 'మీరేం భయపడకండి సార్...!' అయిదు నిమిషాల్లో స్టెపిన్ టైరు వేస్తాను' అంటు డిక్కిలోంచి టైరు తీసాడు.

'హమ్మయ్య...!' బతికించావు అనుకున్నాడు మనస్సులో.

టైరు వేయటం పూర్తయింది!

'ఇక పోనీయ్...!'

'ఎక్కడికి...! పైకి పోతావా...?' డ్రైవరు వేతిలో బటన్ వాకు తెరుచుకుంది.

'ఏంటి! ఎవరు నువ్వు... ఎందుకు నా మీదకు వస్తున్నావ్...!' తత్తరపాటు, ఆందోళన భయం బయలుదేరాయి.

పది సంవత్సరాల క్రితం...!

'మీ ఫ్యాక్టరిలో ఉద్యోగం వేసుకొంటున్న హరి ప్రసాద్ గుర్తున్నాడా?'

జోగేశ్వరరావుకి ఆ సంఘటన కొద్ది, కొద్దిగ గుర్తుకు వస్తోంది...

'ఆ...!' ఆలోచిస్తూ అన్నాడు జోగేశ్వరరావు!

ఆరోజు... అతను ఫ్యాక్టరీలో పని వేసుకుంటున్న సమయంలో నువ్వు అతని వద్దకు వచ్చావు. నీ పర్సనల్ పనిని అతనికి చెప్పి అర్జంటుగ వేయాలి అని ఆదేశించావు.

అతనికి పని మీద ఉన్న పట్టుదల, నిజాయితీకి, నీవు మెచ్చి అతనికే ఈ పని చెప్పాలి అన్న నీ నిర్ణయం మీద అతనికి పని అప్పచెప్పావు! పని మీద బయటికి వెళ్ళిన అతను అనుకోకుండా ఏక్సిడెంట్‌కు గురి అయి చనిపోయాడు! పని సమయంలోనే సొంత పని మీద అతనిని బయటికి పంపించి ప్రమాదానికి గురి అయినందుకు, పారిశ్రామిక చట్టం ప్రకారం నీవు అందుకు భాద్యుడవు! అతనికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండ బుకాయించావు!

ఫలితంగా అతని కుటుంబం వీధులపాలయి, ఆకలితో అతని కూతురు మరణించింది. భార్య పిచ్చిదయింది. అతని చెల్లెలు ఏ దిక్కు లేక అత్యాచారానికి గురయింది...'

ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు.

జోగేశ్వరరావుకు అంతా గుర్తుకు వచ్చింది...!

'అయితే ... నువ్వు నన్ను ఎందుకు చంపటం..?'

'అతను నా అన్న కాబట్టి....' మరుక్షణం నెత్తుటి మరకల్లో జోగేశ్వరరావు శవం......!

●